సాక్షి నల్లగొండ

శుక్రవారం । 24 । మే । 2024



బుద్ధుడు.. గొప్ప దార్శనికుడు

బుద్ధుడు గొప్ప దార్శనికుడని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ రమేష్‌నాయుడు అన్నారు. - 8లో



మహోన్నత వ్యక్తి..

సీపీఎం సీనియర్ నేత అనంతరామ శర్మ మహోన్నత వ్యక్తి అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. - 8లో

గరిష్టం / కనిష్టం
40° / 27°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



నల్లగొండలోని ఓ సెంటర్‌లో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

నల్లగొండ: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి జరుగనున్నాయి. మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 12 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ నెల 31న పరీక్షలు ముగియనున్నాయి. ఆదివారంతోపాటు, ఈ నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా సెలవులు ఉన్నందున ఆ రెండు రోజుల్లో పరీక్షలు జరగవని డీఐఈఓ దస్రూనాయక్ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలించొద్దు

- ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చందనా దీప్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చే వారు అనుమతి పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఇసుకను ఆన్‌లైన్‌లో ఎవరి పేరు మీద బుక్ చేసుకుంటే అక్కడే సరఫరా చేయాలని పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్లను అనవసరంగా రోడ్లపైన ఆపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అలాంటి వారిపై ట్రాఫిక్ నిబంధనలు ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎడ్‌సెట్‌కు 331మంది హాజరు

నల్లగొండ: రెండు సంవత్సరాల బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి గురువారం కంప్యూటర్ బేస్ట్ టెస్ట్(సీబీటీ) పద్ధతిన నల్లగొండలోని ఎస్పీఆర్ పాఠశాల సెంటర్‌లో నిర్వహించిన టీఎస్ ఎడ్‌సెట్-2024 ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు కొనసాగాయి. ఈ పరీక్షలకు 360 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 331 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం పరీక్షకు 162 మంది, మధ్యాహ్నం 169 మంది విద్యార్థులు హాజరుకాగా 29 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష సెంటర్‌ను తెలంగాణ ఎడ్‌సెట్ పరిశీలకుడు బొడ్డుపల్లి రామకృష్ణ పర్యవేక్షించారు. ఆయన వెంట పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నీలంరెడ్డి ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



యూనిఫాం కుట్టుపని కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

మిర్యాలగూడ: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషిచేస్తున్నామని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. గురువారం మిర్యాలగూడలోని ఎమ్మార్సీ భవనంలో ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ముత్తిరెడ్డికుంట కమ్యూనిటీ హాల్, మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న యూనిఫాం కుట్టు పనిని పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 1,880 పాఠశాలల్లో, 87,015 మంది విద్యార్థులకు యూనిఫాం కుట్టేపనిని స్వయం సహాయక సంఘాలకు అప్పగించామని, జూన్ 6లోపు ఒక జత యూనిఫాం కుట్టి అందించాలన్నారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు అందించాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూమీడియం ఇస్లాంపుర పాఠశాలలో పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్ ఉన్నారు.

రేపటితో ఆఖరు

పతాక స్థాయికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

- వాయిస్ ఫోన్‌కాల్స్‌తో ఓట్లడుగుతున్న అభ్యర్థులు
- ప్రచారంలో దూసుకెళ్తున్న ప్రధాన పార్టీలు
- ఓటర్లను ఆకర్షించేందుకు తాయిలాలు!



దేవరకొండలో జరిగిన పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారానికి శనివారం సాయంత్రంతో తెరపడనుంది. 27వ తేదీన పోలింగ్ జరగనుండడంతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల ముఖ్య నేతలంతా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ సభలు, సమావేశాలు నిర్వహిస్తూనే పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులతోపాటు స్థానిక నేతలతో ప్రచారం నిర్వహిస్తోంది. ఆ పార్టీ నాయకులు పట్టణాలు, గ్రామాలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను తీసుకొని ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఫోన్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇక బీఆర్‌ఎస్, బీజేపీ రాష్ట్ర స్థాయి నేతలు సభలు, సమావేశాలతో ప్రచార జోరు పెంచారు.

ఓటర్లను ఆకర్షించేందుకు ప్రణాళికలు

ప్రచారానికి రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. సోమవారం ఎన్నికలు జరగనున్నాయి. దీంతో మూడు ప్రధాన పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. పెద్ద ఎత్తున సభలు, సమావేశాలతో పాటు తమ అనుచరులు, పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పట్టభద్రులైన ఓటర్లను కలిసే విధంగా ప్రణాళికలు చేసుకుని ముందుకు సాగుతున్నారు. ఎన్నికల్లో ఈ నాలుగు రోజులే కీలకం కావడంతో ఎక్కడికక్కడ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి అయితే పావలావంతు ఓటర్లకు డబ్బు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది.

గిఫ్టులతో ఆకట్టుకునేలా..

పట్టణాలు, గ్రామాల్లో వార్డుల వారీగా ఎంత మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారనే సమగ్ర వివరాలను సేకరించారు. ఓటరు స్లిప్పుల ఆధారంగా ఆయా పార్టీల నేతలు ఓటర్ల వివరాలను వివరాలు తీసుకొని పోల్ మేనేజ్‌మెంట్‌కు సిద్ధమయ్యారు. క్షేత్రస్థాయిలోని నేతలు తమ పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు? అందులో తమ పార్టీకి అనుకూలంగా ఉండేవారు ఎందరు అన్న వివరాలతో కూడిన నివేదికలను పార్టీ ముఖ్య నేతలకు, ఎన్నికల ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న నేతలకు అందజేశారు. తద్వారా ఆయా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఓ ప్రధాన పార్టీ పెద్ద ఎత్తున గిఫ్టులను సైతం కొనుగోలు చేసినట్లు తెలిసింది.

రికార్డెడ్ వాయిస్‌తో ఫోన్‌కాల్స్

కొందరు అభ్యర్థులు పట్టభద్రులను ప్రసన్నం చేసుకునేందుకు రికార్డెడ్ వాయిస్‌తో కూడిన ఫోన్‌కాల్స్ చేస్తూ తమకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఓటర్లకు రోజూ ఐదు నుంచి పది కాల్స్ చేసేలా ఏర్పాట్లు చేశారు. మరికొందరు తమ పార్టీ అభ్యర్థుల తరఫున పట్టభద్రుల ఓటర్లకు స్వయంగా ఫోన్ చేసి మరీ ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అభ్యర్థి తరఫున ఓటరు జాబితా ఆధారంగా ఇంటింటికి తిరుగుతూ తమ పార్టీ అభ్యర్థికి ఓట్లు వేయాలని కోరుతున్నారు. ప్రధానంగా పట్టణాల్లో అయితే ఒక్కో వార్డులో 500 లోపే ఓటర్లు ఉన్నందున వారిని గుర్తించడం సులభం కాబట్టి వారిని కలిసి అభ్యర్థించే పని పెట్టుకున్నారు. లేదంటే ఓటరు జాబితాలోని ఫోన్ నంబర్ల ఆధారంగా ఫోన్ చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు.

గెలవాలనే పట్టుదలతో..

ఈ ఎన్నికలు మూడు ప్రధాన పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. పదేళ్ల తర్వా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తోంది. తమ పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉండడంతో వారికి బాధ్యతలు అప్పగించి మరీ ప్రచారం చేయిస్తోంది. ఇక.. బీఆర్‌ఎస్‌కు ఇది సిట్టింగ్ స్థానం కావడంతో తిరిగి పొందాలనే లక్ష్యంతో ప్రచారం చేస్తోంది. కేటీఆర్, హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి సహా మాజీ మంత్రులు రంగంలోకి దిగారు. బీజేపీ కనీసం ఈసారైనా పట్టభద్రుల స్థానాన్ని దక్కించుకోవాలని ప్రయత్నిస్తోంది. ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, డీకే అరుణ, డాక్టర్ లక్ష్మణ్ వంటి నేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్, చిత్రంలో అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి, ఎంపీ వెంకటేష్‌నేత, మహేశ్వర్‌రెడ్డి తదితరులు

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్

నల్లగొండ టూటౌన్: అన్నివర్గాల ప్రజల పక్షాన పోరాడేది బీజేపీ మాత్రమేనని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఆత్మీయ సమావేశం, మీడియా సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఎవరి స్వార్థం కోసం వచ్చిందో ఒకసారి పట్టభద్రులు ఆలోచన చేయాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే మండలిలో పోరాడే దమ్మున్న వ్యక్తి ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేయాలన్నారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్‌నేత, ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు మాదగాని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి, నూకల నర్సింహారెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, బండారు ప్రసాద్, పిల్లి రామరాజుయాదవ్, సీహెచ్.విఠల్, లక్ష్మీనర్సయ్య, శ్రీదేవిరెడ్డి, కంకణాల నివేదిత, పోతెపాక సాంబయ్య, లింగస్వామి పాల్గొన్నారు.

సమాజంలో చీలికలు తెస్తున్న కాంగ్రెస్

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి మోదీపై తప్పుడు ఆరోపణలు చేస్తుందని, కులం, మతం, పేరిట సమాజంలో చీలికలు తెస్తుందని కె.లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ అధికార దాహంతో భారతదేశాన్ని మూడు ముక్కలు చేసిందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు అని రాహుల్‌గాంధీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. మోదీ ప్రభుత్వం అదనంగా 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చిందే తప్ప రిజర్వేషన్లు తొలగించలేదన్నారు. మతపరమైన రిజర్వేషన్లు చెల్లవని కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు లాంటిందన్నారు. ముస్లింల రిజర్వేషన్లతో ఓబీసీల రిజర్వేషన్లు తగ్గి నష్టపోతున్నారని తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



నల్లగొండలో జరిగిన సమావేశానికి హాజరైన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ మంత్రి ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మిర్యాలగూడ: ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ విమర్శించారు. గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం తప్ప ఇతర గ్యారంటీలను అమలు చేయలేదన్నారు. కనీసం ఆర్టీసీ సమస్యలను పరిష్కరించకుండా వారిపై అదనపు భారం వేసిందన్నారు. వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే అని రైతులను మోసం చేసిందన్నారు. రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి నేటి వరకు అమలు చేయలేదన్నారు. ఎమ్మెల్సీ పదవి వద్దని రాజీనామా చేసిన బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో ఓటు వేయాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రేపాల పురుషోత్తంరెడ్డి, అసెంబ్లీ ప్రభారీ గోగు లచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, నాయకులు సజ్జల నాగిరెడ్డి, బంటు సైదులు, కొండేటి సరిత, చిలుకూరి శ్యామ్, రమాదేవి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, శ్రీనివాస్, జానకిరాంరెడ్డి పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల కౌంటింగ్ నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్ ప్రక్రియపై సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి సిబ్బంది షెడ్యూల్ కంటే ముందే రావాలని, సెల్ ఫోన్లను తీసుకురావద్దని చెప్పారు. ప్రాథమిక లెక్కింపులో చెల్లిన ఓట్లు చెల్లని ఓట్ల వర్గీకరణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఫలితం తేలకపోతే పాటించే ఎలిమినేషన్ ప్రక్రియపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ నటరాజ్, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, మాస్టర్ ట్రైనర్ బాలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నిర్ణీత సమయానికే ప్రచారం ముగించాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన



నల్లగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో ఉన్న అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల ప్రచారాన్ని నిర్ణీత సమయమైన ఈనెల 25వ తేదీ సాయంత్రం 4 గంటలకే ముగించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం చేస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. ప్రచారం ముగిసిన వెంటనే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులను పంపించి వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ నియోజకవర్గం, జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని పేర్కొన్నారు.

నేడు నకిరేకల్‌కు కేటీఆర్ రాక

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి నకిరేకల్ పట్టణానికి రానున్నారని స్థానిక మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. గురువారం నకిరేకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం ఉదయం 10:30 గంటలకు నకిరేకల్‌లోని సువర్ణ గార్డెన్‌లో నిర్వహించే నియోజకవర్గ పట్టభద్రుల ఆత్మీయ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పట్టభద్రులంతా హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబు, స్థానిక మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు యల్లపురెడ్డి సైదిరెడ్డి, ప్రగడపు నవీన్‌రావు, నాయకులు పెండెం సదానందం, రాచకొండ వెంకన్న, సోమ యాదగిరి, దైద పరమేశం, సిలివేరు ప్రభాకర్, చాగోని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మట్టపల్లి నృసింహుడి తిరుకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణోత్సవాన్ని గురువారం తెల్లవారు జామున 5గంటలకు వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. అర్చకులు క్రిష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, పపద్మనాభా చార్యులు, బ్రహ్మచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు బృందం శ్రీస్వామి అమ్మవార్లకు జీలకర్ర,బెల్లం, యజ్ఞోపవీతం , తాళిబొట్టు ,తలంబ్రాలు తదితర కార్యక్రమాలతో కల్యాణతంతును ముగించారు. కల్యాణతంతును వీక్షించేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. అనంతరం శ్రీకేశవ తీర్థ ఆశ్రమంలో కల్యాణమూర్తులకు గరుడవాహన సేవ నిర్వహించారు. భక్తిసంగీతవిభావరి అనంతరం శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ సమేతంగా రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమందరాజు, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్‌కుమార్, ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మట్టపల్లి క్షేత్రంలో జరిగిన శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణమహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

సన్నాలపై సందిగ్ధం

- సన్నధాన్యానికే రూ.500 బోనస్ అంటున్న ప్రభుత్వం
- జిల్లాలో 70 శాతం దొడ్డురకం వడ్లు పండిస్తున్న రైతులు
- సాగర్ ఆయకట్టులో మాత్రమే సన్నాల సాగు
- ఏ వడ్లు సాగుచేయాలోనన్న అయోమయంలో అన్నదాతలు



మూడు సీజన్లలో వరిసాగు ఇలా.. (ఎకరాలలో..)

సీజన్	వరిసాగు	దొడ్డురకం	సన్నాలు
యాసంగి (2022-23)	5,12,103	3,98,570	1,22,533
వానాకాలం (2023-24)	4,21,263	3,02,200	1,19,063
యాసంగి (2023-24)	4,20,119	3,06,119	1,14,000

నల్లగొండ అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచి సన్నరకం ధాన్యం పండించిన రైతులకు మాత్రమే క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించింది. కానీ.. దొడ్డురకం వడ్లపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచి సన్నాలు సాగు చేయాలా లేదా దొడ్డురకం వరి సాగు చేయాలా అనే అయోమయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. జిల్లాలో గత ఐదారేళ్లుగా రైతులు ఎక్కువగా వానాకాలం, యాసంగి రెండు సీజన్లలో దొడ్డురకం ధాన్యాన్నే సాగు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో హైబ్రీడ్ రకాల వరి వంగడాలు అందుబాటులోకి రావడం వల్ల దొడ్డురకం వరి సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 70 శాతం సాగుభూమిలో రైతులు వానాకాలం, యాసంగి సీజన్లలో దొడ్డురకాన్నే సాగు చేస్తున్నారు. కేవలం 30 శాతం సాగు భూమిలోనే సన్నరకం ధాన్యం సాగవుతుంది.

ఆయకట్టు ప్రాంతంలోనే సన్నాలు

జిల్లాలో ముఖ్యంగా నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోనే ఎక్కువగా సన్నరకం వరిని రైతులు సాగు చేస్తున్నారు. వేములపల్లి, మిర్యాలగూడ, త్రిపురారం, నిడమనూరు, హాలియా, తిరుమలగిరిసాగర్, అడవిదేవులపల్లి, దామరచర్ల మండలాలతో పాటు నాన్‌ఆయకట్టు ప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో మాత్రమే సన్నాల వరిని సాగు చేస్తున్నారు. ఆయకట్టు ప్రాంతంలో ఎక్కువ మిల్లులు ఉండడంతో పాటుగా ఆయా మిల్లర్లు తేమ శాతంతోనే ఎక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో ఆ ప్రాంతంలోని రైతులు సన్నాల వరిని సాగు చేస్తున్నారు.

నాన్‌ఆయకట్టులో దొడ్డురకమే..

నాన్‌ఆయకట్టు ప్రాంతమైన కనగల్, గుర్రంపోడు, దేవరకొండ, నాంపల్లి, చింతపల్లి, మునుగోడు, మర్రిగూడ, నల్లగొండ, తిప్పర్తి, నకిరేకల్, నార్కట్‌పల్లి, చిట్యాల, చండూరు, గట్టుప్పల్ తదితర మండలాల్లో రైతులు ఎక్కువ శాతం దొడ్డురకం వరిని సాగు చేస్తున్న పరిస్థితి. దొడ్డురకం వరికి తెగుళ్లు తక్కువ సోకడం, దిగుబడి సన్నాల కంటే ఎక్కువ రావడం, సన్నాలు వేస్తే అమ్మకానికి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం, సన్నాలకు తెగుళ్లు ఎక్కువ ఆశించడంతో పాటుగా దిగుబడి కూడా తక్కువ రావడం కారణాలతో రైతులు దొడ్డురకం సాగుచేస్తున్నారు. దీనికితోడు దొడ్డురకం వడ్లు అమ్మకం కోసం రైతులు పెద్దగా ఇబ్బందులు పడాల్సిన పనిలేదు. ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల రైతులు దొడ్డురకం వడ్లు అమ్ముకోవడం సులువుగా మారింది. సన్నాలను మిల్లులకు తరలించాలంటే రవాణాభారంతో పాటుగా మిల్లర్లు కొర్రీలు పెడితే రోజులకొద్ది వేచిచూడాల్సిన పరిస్థితి వస్తుండడంతో రైతులు సన్నాల జోలికి పోవడం లేదు.

సీజన్ దగ్గరకొస్తుండడంతో..

ప్రస్తుత వానాకాలం సీజన్ దగ్గరకొస్తోంది. రోహిణి కార్తె వస్తుండడం, మృగశిర కార్తె దాటిన వెంటనే రైతులు వరినాట్లు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ప్రభుత్వం చేసిన బోనస్ ప్రకటనతో రైతులు ఏ రకం వరిని సాగు చేసుకోవాలో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో సన్నాలతో పాటుగా దొడ్డు రకం ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

దొడ్డురకం దిగుబడి ఎక్కువ



దొడ్డురకం వరి సాగుచేస్తే దిగుబడి ఎక్కువ. ఎకరానికి 25నుంచి 30 క్వింటాళ్ల వడ్లు పండుతాయి. తెగుళ్లు, పెట్టుబడి కూడా తక్కువే. దొడ్డు వడ్లు అమ్ముకోవడం సులభం. సన్నాలు అయితే దిగుబడి తక్కువ, తెగుళ్లు ఎక్కువ. సన్నాలు అమ్మాలన్నా ఇబ్బందే. అందుకే దొడ్డు రకం సాగుచేస్తాం.

– జానపాటి రాజేంద్రప్రసాద్, రైతు, గుండ్లపల్లి, నల్లగొండ మండలం

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



సన్నవడ్ల సాగుపై ప్రభుత్వం నుంచి వ్యవసాయ శాఖకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి వ్యవసాయ శాఖకు స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తరువాత రైతులకు సమాచారం అందిస్తాం.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

క్లుప్తంగా

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

నల్లగొండ: 'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి వచ్చేనెల 26 వరకు ఆసక్తి గల మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నారు. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ ఇస్తారు. ఇక్కడ త్రెడ్డింగ్, వ్యాక్స్, సెడిక్యూర్, మెనిక్యూర్, బ్లీచింగ్, స్కిన్ కేర్, హెయిర్ కేర్, వైట్నింగ్ ఫేస్ ప్యాక్స్, డ్యాండ్రఫ్ ట్రీట్‌మెంట్, హెయిర్‌ఫాల్ ట్రీట్‌మెంట్, హెయిర్ కట్స్, హెయిర్ స్టైల్స్, హెన్నా ప్రిపరేషన్, డై అప్లికేషన్, మేకప్స్ (బ్రైడల్, పార్టీ, లైట్ మేకప్స్), హెయిర్ మసాజ్, కమ్యూనికేషన్ అండ్ గ్రూమింగ్, ఫేషియల్స్ తదితర వాటిల్లో శిక్షణ ఉంటుంది. శిక్షణ కోసం ఈనెల 27 వరకు నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్ లో గల సాహితీ బ్యూటీ పార్లర్ అండ్ ట్రెనింగ్ సెంటర్‌లో రూ.3వేలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌లు అందజేస్తారు. ఇతర వివరాల కోసం 9666013544, 80747 42864 సెల్‌నంబర్లలో సంప్రదించాలి.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని గణేష్ నగర్‌లో కల్వర్ట్ వద్ద గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ నరేష్ వివరాల ప్రకారం.. ఇతను రెండు రోజులుగా గణేష్‌నగర్‌లోని తన్నీరు నర్సింహారావు వద్ద సూతారి పనికి వెళ్తున్నాడు. గురువారం మద్యం మత్తులో ఉండటంతో పనికి వద్దని పంపించి వేశాడు. దీంతో రైల్వే స్టేషన్ రోడ్డులో కొంత సేపు అటుఇటూ తిరుగుతూ పక్కనే ఉన్న కల్వర్టు మోరీ వద్ద నిద్రించాడు. మంచి నీరు, ఆహారం దొరకక మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో మార్చురీలో భద్రపరిచారు. స్థానిక కౌన్సిలర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడిని గుర్తించినట్లయితే 8712670189, 8712670151 నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

మంత్రి వెంకట్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



మంత్రి వెంకట్‌రెడ్డికి చిత్రపటం బహూకరిస్తున్న రేఖ, అగస్త్య దంపతులు

అర్వపల్లి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అడివెంల గ్రామానికి చెందిన జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి, రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ-సినీ మ్యూజిక్ డైరెక్టర్ అగస్త్య దంపతులు గురువారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం బహూకరించారు.

ఆదర్శ పాఠశాలలు పిలుస్తున్నాయ్..

- 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈనెల 25 వరకు గడువు
- ఒక్కో పాఠశాలకు 160సీట్లు
- జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం



కేతేపల్లి : కొర్లపహాడ్‌లోని ఆదర్శ పాఠశాల

కేతేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఇంటర్మీడియట్ ఆంగ్లమాధ్యమంలో చదవాలనుకునే వారికి ఆదర్శ పాఠశాలలు ఓ వరంలా మారాయి. ఈ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంలో మెరుగైన విద్యతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం, పలురకాల మౌలిక వసతులు కల్పిస్తుండటంతో వాటికి ఆదరణ పెరిగింది. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈనెల 10నుంచి 25వతేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు.

ప్రతి పాఠశాలకు 160 సీట్లు..

ఆదర్శ పాఠశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, గ్రూపులుండగా ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ప్రతి పాఠశాలలో 160మందికి అవకాశం కల్పించనున్నారు. ఈ కోర్సులను ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులకు బోధించనున్నారు.

బాలికలకు హాస్టల్ సౌకర్యం..

ఆదర్శ పాఠశాలలో చదువుకునే బాలికలకు హాస్టల్ వసతి ఉంది. 9,10 తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 100మందికి ఈ అవకాశం ఉంది. హాస్టల్‌కు కనీసం మూడు కిలోమీటర్ల నుంచి ఆపై దూరంగా గ్రామాల నుంచి వచ్చే వారు మాత్రమే వసతిగృహంలో ప్రవేశానికి అర్హులు.

రేపటితో ముగియనున్న గడువు..

ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 25(శనివారం) వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పాఠశాలలో ఇంటర్ విద్యతో పాటు ఎంసెట్, నీట్, సీఏ, సీపీటీ కోచింగ్‌తో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్‌కు దరఖాస్తు చేయవచ్చు. పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగానే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీట్లను భర్తీ చేస్తారు. ఈనెల 26న దరఖాస్తులు పరిశీలించి ఎంపికైన వారి జాబితాలను పాఠశాలల్లో ప్రదర్శిస్తారు. ఈనెల 27నుంచి 31వరకు ఎంపికైన విద్యార్థుల విద్యార్హత ధ్రువపత్రాలను పరిశీలించి ప్రవేశాలు కల్పించి జూన్ 1నుంచి తరగతులు ప్రారంభించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు చక్కని క్రమశిక్షణ ఉంటుంది. అనుభవం కలిగిన అధ్యాపకులతో బోధన ఉంటుంది. మంచి వసతులు ఉన్నాయి. మంచి ఫలితాలు వస్తున్నాయి. ఆటలకు ప్రాధాన్యతనిస్తాం. మెరుగైన ఫలితాలతో ముందంజలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపిస్తున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– సబితారెడ్డి, ప్రిన్సిపాల్, ఆదర్శ పాఠశాల, కొర్లపహాడ్

మహోన్నత వ్యక్తి అనంతరామ శర్మ



అనంతరామశర్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం, వీరయ్య తదితర నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నల్లగొండ టౌన్: సమసమాజ నిర్మాణం కోసం అహర్నిశలు పోరాడిన మహోన్నత వ్యక్తి, తెలంగాణ పోరాట యోధుడు, స్వాతంత్య్ర సమరయోధుడు పెన్నా అనంతరామశర్మ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో పెన్నా అనంతరామశర్మ భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. అనంతరరామ శర్మ ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని, ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడిన వ్యక్తి శర్మ అని కొనియాడారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. అనంతరామ శర్మ ప్రజాసంఘాల్లో కీలక బాధ్యతలు నిర్వహించి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషిచేశారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ శర్మ నిస్వార్థ ఉద్యమకారుడని.. రాజకీయాల్లో సౌమ్యంగా ఉంటూ కఠిన నిర్ణయాలు తీసుకునేవాడని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీరయ్య, మల్లు లక్ష్మి, డీజీ నర్సింహారావు, జూలకంటి రంగారెడ్డి, సీపీఎం నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మల్లు నాగార్జున రెడ్డి, ఎండీ జహంగీర్, సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సీపీఐ, సీపీఎం నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, తుమ్మల వీరారెడ్డి, పాలడుగు నాగార్జున, నారి ఐలయ్య, ప్రభావతి, కందాల ప్రమీల, బండ శ్రీశైలం, చినపాక లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు మాదగోని శ్రీనివాసగౌడ్, పిల్లి రామరాజు పాల్గొని నివాళులర్పించారు.

పిట్టంపల్లిలో అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు

కట్టంగూర్: సీపీఎం సీనియర్ నేత పెన్నా అనంత రామశర్మ అంత్యక్రియలు గురువారం కట్టంగూర్ మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో అశ్రునయనాల నడుమ జరిగాయి. గ్రామంలో సీపీఎం కళాకారులు పాటలు పాడుతూ అంతిమయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట సీపీఎం జిల్లా కార్యదర్శులు, కటికం సత్తయ్యగౌడ్, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, ఇటికాల సురేందర్, బొజ్జ చినవెంకులు, మాజీ ఎంపీపీ కొండ లింగస్వామి, చెవుగోని సాయిలు, చిన్నపాక లక్ష్మీనారాయణ, మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడు గొప్ప దార్శనికుడు

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌నాయుడు



బుద్ధుడి పాదాల వద్ద పూజలు చేస్తున్న రమేష్‌నాయుడు

నాగార్జునసాగర్: ప్రపంచ మానవాళికి చక్కటి జీవన విధానాన్ని అందించిన గొప్ప దార్శనికుడు గౌతమ బుద్ధుడు అని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌నాయుడు అన్నారు. గురువారం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బుద్ధ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కర్ణాటక రాష్ట్రంలోని బైలు కుప్పే సెర బౌద్ధారామానికి చెందిన గెషే నవాంగ్ జుంగే, సికింద్రాబాద్ మహాబోధి బుద్ధ విహారం నుంచి వచ్చిన శీలం చారోలాతో కలిసి బుద్ధుడి పాదాల వద్ద పూజలు చేశారు. అనంతరం మహాస్థూపం అంతర్భాగంలోని ఆచార్య నాగార్జున కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం హైదరాబాద్ కేంద్రియ విశ్వ విద్యాలయానికి చెందిన చరిత్ర విభాగం పూర్వ అధ్యక్షుడు, చరిత్రకారిణి ఆచార్య అలోక పరా షేర్ షీకు బౌద్ధంలో స్నేహం అనే అంశంపై, శాతవాహన విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య మల్లేష్ సంకశాల బౌద్ధంలో సామాజికత అనే అంశంపై ప్రసంగించారు. బుద్ధవనం కన్సల్టెంట్ బౌద్ధ పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి రచించిన బుద్ధుడి మొదటి ప్రవచనం, బుద్ధుడి చివరి రోజులు పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్‌డీ సూదన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉపేందర్‌రెడ్డి, హోటల్స్ జీఎం నాదన్, జిల్లా పర్యాటక అధికారి శివాజీ, విజయ్ విహార్ మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. చిట్యాల పట్టణానికి చెందిన ఆవుల శ్రీశైలం(42) తన ప్యాసింజర్ ఆటోలో హైదరాబాద్ వైపునకు వెళ్తున్నాడు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలోకి వెళ్లగానే విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న డీసీఎం శ్రీశైలం ప్రయాణిస్తున్న ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో నడుపుతున్న శ్రీశైలం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హుండీ అపహరణ

రామన్నపేట : మండలంలోని దుబ్బాక శివారులో గల వంకబయ్యన్న ఆలయ హుండీని గురువారం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఆలయంలో పూజలు నిర్వహించేందుకు వచ్చిన పూజారికి ఆలయంలో ఉన్న హుండీ కనిపించలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు ఆలయాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. హుండీలో సుమారు రూ.10వేల వరకు నగదు ఉండొచ్చని భావిస్తున్నారు.

నేడు కృషి విజ్ఞాన కేంద్రంలో విత్తన మేళా

త్రిపురారం: కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం కంపాసాగర్‌లో శుక్రవారం వరి విత్తన మేళా నిర్వహించనున్నట్లు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు, వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ లింగయ్య గురువారం తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జేజీఎల్ 27356 (అతి చిన్న గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ.1,100, కేఎన్‌ఎం 118(దొడ్డు గింజ రకం) 25 కేజీల బ్యాగ్ రూ. 1,100. జేజీఎల్ 24423 (దొడ్డు గింజ రకం) 25 కేజీలు రూ.1,100 ఉన్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం కంపాసాగర్ ఆధ్వర్యంలో కేఎన్‌ఎం 118 (దొడ్డు గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ. 1100, ఎంటీయూ 1010 (దొడ్డు గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ. 1100, కేపీఎస్ 2874 (సన్న గింజ రకం) 20 కేజీల బ్యాగ్ ధర రూ.1556, కేపీఎస్ 6521 (సన్న గింజ రకం) 25 కేజీల బ్యాగ్ ధర రూ. 1200 ఉందని తెలిపారు.

పాత నేరస్తుడి దారుణ హత్య

- మూసీ నదిలో మృతదేహం వెలికితీత
- పోలీసుల అదుపులో నిందితులు



లింగు (ఫైల్)

భువనగిరి క్రైం: జనవరి 16న కనిపించకుండా పోయిన భువనగిరి మండలంలోని పచ్చర్లబోడు తండాకు చెందిన కునుసోతు లింగు దారుణ హత్యకు గురయ్యాడు. మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ విచారణ చేయగా.. ఈ లింగు హత్యకు గురైన విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు గురువారం మూసీ నదిలో లింగు మృతదేహం వెలికితీశారు. పచ్చర్లబోడు తండాకు చెందిన కునుసోతు లింగు(45) తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. తన చెల్లెలితో అదే గ్రామానికి చెందిన బానోతు దేవిసింగ్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో తరచూ అతడిని బెదిరించేవాడు. దీంతో దేవిసింగ్ భయాందోళనకు గురై అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడైన నరేష్ సాయంతో జనవరిలో లింగును హత్య చేసి గ్రామ శివారులో ఉన్న మూసీ నది మధ్యలో పడేసినట్లు తెలుస్తోంది. అనంతరం తనపైకి రాకుండా లింగు చెల్లెలితో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు బానోతు దేవిసింగ్‌ను అనుమానించి పలుమార్లు విచారణ చేపట్టారు. గురువారం దేవిసింగ్‌ను భువనగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో కునుసోతు లింగుని తన వ్యవసాయ క్షేత్రం వద్ద హత్య చేసి ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి మూసీ నదిలో వేసినట్లు చెప్పాడు. కాగా.. లింగుపై గతంలో హత్య కేసు, దొంగతనాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి.

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా కారు బోల్తా

- ఒకరు మృతి.. నలుగురికి గాయాలు



ఘటనా స్థలిలో రేఖా ప్రియాంక మృతదేహం

రామగిరి(నల్లగొండ): తిరుపతికి దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా తిప్పర్తి వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా.. కారులో ఉన్న మిగతా నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. చలివాది రేఖా ప్రియాంక(31), భర్త శివసుబ్రహ్మణ్యం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో నివాసం ఉంటున్నారు. ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు నిక్షిత్, తేజ్ వర్ధన్‌లు ఉన్నారు. కుటుంబంతో కలిసి తిరుపతికి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. గురువారం తెల్లవారుజామున డ్రైవర్ కడియపుడి మహేంద్ర అతివేగంతో కారు నడపడంతో తిప్పర్తి పోలీస్‌స్టేషన్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. కారులో ఉన్న రేఖాప్రియాంక అక్కడికక్కడే మృతి చెందింది. భర్త శివసుబ్రహ్మణ్యం, ఇద్దరు పిల్లలు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మృతురాలి తండ్రి చలువాది వెంకటసుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ మహేంద్రపై ఎస్సై రాజు కేసు నమోదు చేశారు. నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో యువకుడు మృతిచెందిన సంఘటన ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నంద్యాల మల్లారెడ్డి పెద్ద కుమార్తె శిరీషకు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఏదులవారి గూడేనికి చెందిన యల్మరెడ్డి వెంకటరెడ్డితో 22 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హేమంత్‌రెడ్డి (19) హైదరాబాద్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇటీవల అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. హేమంత్‌రెడ్డి గురువారం సాయంత్రం తాత మల్లారెడ్డి ట్రాక్టర్ తీసుకొని కల్టివేటర్‌తో చెల్క దున్నడానికి వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే ఉన్న గాతులో పల్టీ కొట్టింది. దీంతో హేమంత్‌రెడ్డిపై ట్రాక్టర్ పడడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి



మల్లయ్య (ఫైల్)

రామన్నపేట : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన రామన్నపేట మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయపల్లి మల్లయ్య(55) రోజు మాదిరిగా గురువారం గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్న సమయంలో అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో సమీపంలో ఉన్న వారు అతడిని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య వెంకటమ్మ(పద్మ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని గీత కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

మేళ్లచెరువు: చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మేళ్లచెరువు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన షేక్ హుస్సేన్ గురువారం మధ్యాహ్నం సమయంలో గ్రామంలోని చెరువుకట్ట సమీపంలో ఉన్న చింతచెట్టు ఎక్కి చిగురు కోస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య షేక్ షాజీదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరమేష్ తెలిపారు.

తాటిచెట్టు ఎక్కుతుండగా మోకు జారడంతో తీవ్ర గాయాలు

తుంగతుర్తి: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన అన్నారం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాలకుర్తి యాదయ్య రోజు మాదిరిగా గురువారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



కృష్ణయ్య (ఫైల్)

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందాడు. కొండమల్లేపల్లి మండలంలోని కోల్‌ముంతలపహాడ్ గ్రామానికి చెందిన ఆకారపు కృష్ణయ్య(47) స్కూటీపై తన స్వగ్రామానికి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యాడు. ఈ మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

కేతేపల్లి : ప్రేమ పేరుతో ఓ మైనర్ బాలికను లోబర్చుకుని గర్భవతిని చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మండలంలోని ఇనుపాముల గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమిస్తున్నానంటూ మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడు. విషయం తెలుసుకున్న యువకుడు బాలికను నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో అడ్మిట్ చేసి అక్కడి నుంచి ఉడాయించినట్లు తెలిసింది. బాలికకు వైద్యపరీక్షలు నిర్వహించిన అక్కడి వైద్యులు ఆమె గర్భవతి అని తేలడంతో వెంటనే జిల్లా పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు నిమ్స్ ఆసుపత్రికి వెళ్లిన పోలీసులు బాలికతో వాంగ్మూలం తీసుకుని, యువకుడిపై పోక్సో చట్టం కింద కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సమాచారం. యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు, బాలికను నల్లగొండలోని భరోసా కేంద్రంలో ఉంచినట్లు, కేసు దర్యాప్తులో స్థానిక పోలీసుల ప్రమేయం లేకుండా ఎస్పీ చందనాదీప్తి, నల్లగొండ డీఎస్పీల ఆధ్వర్యంలో కేసు సమగ్ర దర్యాప్తు సాగుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి తమ వద్ద వివరాలు లేవని మండల పోలీసులు వెల్లడించారు.

యాదాద్రి కొండపై కూలిన చలువ పందిళ్లు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంతో పాటు యాదాద్రి కొండపైన బుధవారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో యాదాద్రి కొండపైన పరిసరాలలో చలువ పందిళ్లు కుప్పకూలాయి. దీంతో ఉదయం భక్తులు ఆయా మార్గాల్లో నడిచే సమయంలో ఇబ్బందులు పడ్డారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తమై.. కూలిపోయిన చలువ పందిళ్లను తొలగించారు.



యాదాద్రి కొండపై ఈదురు గాలులతో నేలకూలిన చలువ పందిళ్లు